www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 జనవరి 2025
5
తిరుపతి





నరవి ఆసుపత్రిలో...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేలూరు పట్టణంలోని నరవి ఆసుపత్రిలో సమైక్యతకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగను ఆసుపత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జివి సంపత్, వైస్ చైర్మన్ అనిత సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయాలు ఉట్టిపడేలా మట్టికుండలతో పొంగలి (పొంగల్) వండడమే కాకుండా సంగీత, జానపద క్రీడలను నిర్వహించారు. విజేతలకు డాక్టర్ సంపత్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జాకబ్ పాల్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, అభిరామి సంపత్ పాల్గొన్నారు.

నారావారిపల్లెలో చంద్రబాబు కుటుంబ సభ్యుల సందడి



ఊరంతా 'సంక్రాంతి'

వచ్చాం...సందడి చేశాం...వెళ్లొస్తాం..!

ప్రతి ఇంట్లోనూ 'సోలార్' వెలుగులు : చంద్రబాబు

కుటుంబ సమేతంగా 'నారా'వారి 'సందడి'

రంగంపేటలో 'రంకె' వేసిన ఎద్దులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, రామచంద్రాపురం (చంద్రగిరి)

సంక్రాంతి వేడుక మూడు రోజుల పాటు పల్లెల్లో చూడముచ్చటగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా నారావారిపల్లిలోనే మూడు రోజుల పాటు సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మనవడు దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పర్యావరణ హితమే తన లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపకల్పన విశేషాలను మీడియాతో ముఖ్యమంత్రి పంచుకున్నారు. ఇక కనుమ రోజు రంగంపేటలో ఎద్దులు రంకె వేశాయి. జల్లికట్టు యువతలో ఉత్సాహాన్ని నింపింది. చంద్రబాబు మంగళవారం సాయంత్రం బయల్దేరి వెళ్లగా, మంత్రి నారా లోకేష్ బుధవారం అమరావతికి వెళ్లారు. పెద్దల పండుగ రోజు మంగళవారం తల్లిదండ్రులు అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడు సమాధుల వద్ద చంద్రబాబు దంపతులు కుటుంబ సమేతంగా పుష్పాంజలి ఘటించారు. నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిఎం స్వగృహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట మణి ప్రసాద్, డాక్టర్ కే మురళీమోహన్, సినీ నటుడు నారా రోహిత్, నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, నందమూరి వసుంధర, నందమూరి రామకృష్ణ, పులివర్తి వినీల్ పాల్గొన్నారు.



పర్యావరణ హితమే లక్ష్యం : చంద్రబాబు

రాష్ట్రంలో పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రణాళికాబద్దంగా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. నారావారిపల్లి విజన్‌లో భాగంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ప్యానెల్ 3 కిలోవాట్ వరకూ ఏర్పాటు చేసుకుంటే 78వేలు సబ్సిడీ, 2 కిలోవాట్ సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే 65వేలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇంటికి కావాల్సిన విద్యుత్ వాడుకుని, అదనపు మిగులు విద్యుత్‌ను విద్యుత్ శాఖకు ఇస్తే తద్వారా ఆదాయం వస్తుందన్నారు. పెట్టిన ఖర్చు తిరిగి నాలుగైదు సంవత్సరాల్లో తిరిగి వస్తుందన్నారు. కరెంట్ బిల్లు లేని విద్యుత్ తయారు చేసుకోవచ్చన్నారు. వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకోవాలన్నారు. రైతులు ప్రకృతి సేద్యంపై మక్కువ చూపాలన్నారు. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించి 150 సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తిరుపతి – రేణిగుంట సమీపంలో ఒక 10 ఎకరాల స్థలంలో రతన్ టాటా స్ఫూర్తితో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి జిల్లాను పారిశ్రామికంగా అభివద్ధి చేయడంతో పాటు , ఇక్కడి యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడం కోసం చర్యలు తీసుకుంటాం అన్నారు. మన ప్రాంతంలోని వారికి శ్రీ సిటీ ఆధ్వర్యంలో వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్ప్రెన్యూర్ తయారు అయ్యేలా కషి చేస్తా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సోలార్ పవన, పంప్డ్ ఎనర్జీలో పర్యావరణ హితంగా ముందుకు వెళ్లనున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంతో పాటుకలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, పూతలపట్టు ఎంఎల్ఏ మురళీ మోహన్ పాల్గొన్నారు. రవి నాయుడు, నరసింహా యాదవ్ పాల్గొన్నారు.

సీఎంకు ఆత్మీయ వీడ్కోలు

తిరుపతి పర్యటనలో భాగంగా మూడు రోజుల పాటు నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాలలో పాల్గొని అమరావతికి తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డాలర్స్ గ్రూప్ అధినేత డాక్టర్ సి దివాకర్ రెడ్డి రేణిగుంట ఎయిర్పోర్ట్‌లో ఆత్మీయ వీడ్కోలు పలికారు.

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీ మలయప్పస్వామివారు తిరుచ్చిలో వేంచేశారు. వారి వెంట మరో తిరుచ్చిపై శ్రీ కృష్ణస్వామి వేంచేశారు.అంతకు ముందు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామివారి సంకీర్తనలు ఆలపించారు. తరువాత శ్రీ మలయప్ప స్వామివారి తరపున కొందరు అర్చకులు ముందుకు కొంత దూరము పరుగెత్తి మూడుసార్లు ఈటెను విసిరారు.ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పార్వేట ఉత్సవము ఘనంగా ముగిసింది. ఈ ఉత్సవంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీఈఓ లోకనాథం, ముఖ్య అర్చకులు కిరణ్ స్వామి, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్వీ గోశాలలో గోపూజ మహోత్సవం

తిరుపతి శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి వేణుగానం, 8 నుంచి 9 గంటల వరకు తిరుమల శ్రీ వేంకటేశ్వర వేదపాఠశాల విద్యార్థులు వేద పారాయణం జరిపారు. ఉదయం 8 నుండి 10.30 గంటల వరకు దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజన, కోలాటాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శ్రీవేణుగోపాలస్వామి వారి సన్నిధిలో గోపూజ, స్వామి హారతి, తులసి పూజ, గొబ్బెమ్మ వేడుక, గజపూజ, అశ్వపూజ, వృషభ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకున్నారు. అనంతరం భక్తులకు శ్రీవేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పండగ రోజు 'పచ్చిగడ్డి' కరువాయే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తిలో గోవుకు ఎండుగడ్డితోనే సరిపెట్టిన నిర్వాహకులు

కనుమ పండుగ నాడు శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గోవులకు పచ్చి గడ్డి కరువైంది. పశువుల కోసం ప్రత్యేకంగా జరుపుకునే పశువుల పండుగనాడు ఆలయంలోని గోవులకు పచ్చి గడ్డి సరఫరా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో గోవులు ఉన్న శ్రద్ధ పశువులపై లేకుండా పోయింది. ఆలయ నాలుగో గేటు వద్ద భక్తులు గోవులను పూజించేలా ఏర్పాట్లు చేశారు. ఆ గోవులకందించే నిత్య దాణాతో ఎండుగడ్డితో పాటు పచ్చి గడ్డిని కూడా అందించాల్సి ఉంటుంది. గోవుల సంరక్షణార్ధం భక్తులు పెద్ద మొత్తాల్లో విరాళాలు అందిస్తూ ఉంటారు. ఈ రకంగానూ ఆలయానికి ఆదాయ వనరుగా మారిన గోవులకు పశువుల పండుగనాడు ఎండుగడ్డితో సరిపెట్టడం చూస్తుంటే ఆలయాధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఇకనైనా ముక్కంటి అధికారుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పండుగ రోజు ఆలయానికి విచ్చేసే భక్తులు గోవులకు పచ్చిగడ్డి నోటికి అందించి తమ భక్తిని చాటుకోవడం ఆనవాయితీ.

వాకర్స్‌చే పండుగ సంబరాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతిలోని శ్రీ గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి సందర్భంగా వాకర్స్ సభ్యులకు గాలిపటాలను ఎగురవేసి పండుగ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ సభ్యులకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ సభ్యుల మధ్యలో ఆనందోత్సాహాలతో గాలిపటాలు ఎగురవేసి పండగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కష్ణప్రసాద్, శ్రీ గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రఘురాం రెడ్డి, కార్యదర్శి చక్రపాణి, కోశాధికారి పోతప్ప, బంగారు బాబు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తుమ్మలగుంట కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ కేంద్రంగా గత మూడు రోజులుగా సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. ఈ క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిసాయి. క్రీడాకారులకు అత్యంత సౌకర్యవంతంగా పిచ్ అనుకూలించడంతో క్రీడాకారులు పరుగుల వర్షం కురిపించారు. తుమ్మలగుంట గ్రామానికి చెందిన పైరేట్స్ ఎలవన్ జుట్టు 114 పరుగులు చేసి రవి కింగ్స్ జట్టు ముందు 115 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉంచింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన రవి కింగ్స్ జట్టు ఓటమి పాలవడంతో 44 పరుగుల తేడాతో పైరేట్స్ ఎలవన్ జుట్టు అజేయంగా నిలిచింది. మూడవ రోజు జరిగిన టోర్నమెంట్ కు 8 జట్లు పాల్గొనగా విజేతగా నిలిచిన పైరేట్స్ ఎలవన్ జుట్టుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చెతులు మీదుగా పదివేలు, రన్నర్స్ గా నిలిచిన రవి కింగ్స్ జట్టుకు ఐదు వేల నగదు బహుమతిని అందించారు. ఈ టోర్నీలో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుడుని ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం టోర్నమెంట్ బాధ్యత తీసుకుని విజయవంతం చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి క్రీడాకారులు అందరూ ధన్యవాదాలు తెలిపారు.



తిరుమలలో వేడుకగా పార్వేట ఉత్సవం



కోడె గిత్తల జోరు...యువకుల హుషారు

ప్రజాశక్తి రామచంద్రపురం / చంద్రగిరి

'పట్టుకోండి......దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి' అంటూ.... తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి మండలం ఏ రంగంపేట, రామచంద్రాపురం మండలంలోని బొప్పరాజు పల్లి గ్రామంలో బుధవారం పరుష పందేలు అంగరంగ వైభవంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినాలలో మూడవ రోజు కనుమ పండుగ రోజున ఏ రంగంపేట, బొప్పరాజు పల్లి గ్రామాల పశువుల పండుగ కార్యక్రమంలో రంకేసిన కోడిగిత్తలు...... యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. గ్రామంలో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు, ఆవులను రైతులు వాటి కొమ్ములను నున్నగా చెక్కి, కొమ్ములకు రంగులు పూసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడేగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషకంగా నగదును కట్టి నా కోడిగిత్తల పౌరషాన్ని చూడండి అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం' అంటూ యువతకు సవాళ్లు విసిరారు. కోడెగిత్తల కొమ్ములకు బంగారు, వెండి ఆభరణాలు , అభిమాన, రాజకీయ, సినీ నటుల ఫోటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి పందేళ్ళ బరిలోకి దించి, కోడెగిత్తలను డబ్బులు కొడుతూ బెదిరించి పరుగులు చేయించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన బంగారు వెండి ఆభరణాలు, నగదు, పలకలను చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. చెదురు మదుర సంఘటనలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందాలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో అనుపల్లి గ్రామం జనసంద్రమైంది.పరుష పందాలను తిలకించేందుకు దేశ విదేశాల నుండి, తెలంగాణ తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు.. మందుబాబుల ఆగడాలు చెప్పనలివి కాలేదు. వారి మత్తులో మునిగితేలి సరదాగా గడిపారు. పరుష పందాలకు విచ్చేసిన ప్రేక్షకులకు గ్రామస్తులు అన్నపానీయాలు పంపిణీ చేశారు . ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫిబ్రవరి నుంచి పార్టీ బలోపేతం: నారా లోకేష్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి:)

రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటుందని, నాయకులు కార్యకర్తలు బాధ్యతాయుతంగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం నారావారిపల్లి లోని సీఎం స్వగహం నందు చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, కార్యకర్తల సంక్షేమానికి పార్టీ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మాణం చేస్తామని, ఫిబ్రవరి నుంచి పార్టీని బలోపేతం చేసే పని ప్రారంభిస్తాం అన్నారు. తనచుట్టూ తిరగడం వల్ల పదవులు రావని, నాయకుల పనితీరుపై వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామన్నారు. నెలాఖరులో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలు త్వరలో రానున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అహర్నిశలు కష్టపడే వారికే పదవులు వస్తాయని, రెడ్‌బుక్‌ను తాను మరచిపోలేదని, చట్టం తన పని తాను చేసుకుని పోతుందని అన్నారు.

రెడ్డయ్య రాజును అభినందించిన సీఎం

గ్రామీణ ప్రాంతంలో వశిష్ట పాఠశాల స్థాపించి సామాన్య పేద ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న రెడ్డయ్య రాజును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. నారావారిపల్లెలో ముఖ్యమంత్రిని కలిసిన రెడ్డయ్య రాజు రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి 50 వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ దేవరాజు నాయుడు, ఎం కిషోర్ కుమార్ రాజు, డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.



అవ్వాతాతకు నివాళి అర్పించేందుకే వచ్చా

మీడియాతో హీరో మంచు మనోజ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తాను గొడవకు రాలేదని, పండగపూట తన అవ్వా తాతకు నివాళులర్పిద్దాం అని వచ్చానని ప్రముఖ హీరో మంచు మనోజ్ అన్నారు. బుధవారం తిరుపతి చేరుకున్న ఆయన భార్యతో కలిసి నారావారిపల్లెలో మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏ.రంగంపేట వద్ద జరిగిన జల్లికట్టులో పాల్గొని ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. దగ్గరలోని మోహన్ బాబు కళాశాలకు చేరుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ మంచు మోహన్ బాబు, అతని భార్య, మంచు విష్ణు అతని కుటుంబ సభ్యులు అందరూ కళాశాల ఆవరణంలోని ఇంటిలో పండగ జరుపుకుంటున్నారు. మనోజ్ కళాశాలలోకి ప్రవేశిస్తున్నాడని తెలుసుకున్న మోహన్ బాబు సుమారు 500 మందికి పైగా ప్రైవేట్ బౌన్సర్లను, సివిల్ డ్రెస్ లో అక్కడ మొహరింపజేశారు. గేటు వద్దకు చేరుకున్న మనోజ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. లోపలకు అనుమతి లేదని, మీరు ఇక్కడే ఉంటే శాంతి భద్రతలకు వివాదం కలుగుతుందని, వెళ్లిపోవాలని, ఈ మేరకు పోలీసు నోటీసులు ఉన్నాయని తెలిపారు. నోటీసులు తనకి ఇవ్వాలని కోరడంతో పోలీసులు నోటీసుల జిరాక్స్ కాపీని మనోజ్ కి అందజేశారు. దాంతో అక్కడి నుంచి రంగంపేటకు చేరుకున్న మనోజ్, జల్లికట్టు సంబరాల్లో పాల్గొన్నారు. పోలీసులు ఆయనను వెంబడించారు. పీలేరు మార్గంలో మనోజ్ వాహనాలు వెళ్లడంతో, పోలీసులు వెను తిరిగారు. కొద్దిసేపు తర్వాత మనోజ్ తన భార్య మౌనిక తో కలిసి మోహన్ బాబు కళాశాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు లోపలికి ససేమిరా అనడంతో తాను తన అవ్వ తాతకు నివాళులు అర్పించి వెళతానని, అందుకు పోలీసులు సహకరించాలని కోరారు. దీంతో పోలీసులు మోహన్ బాబుతో సంప్రదించి మనోజ్ అవ్వ తాతల సమాధిని సందర్శించేందుకు అనుమతి ఇవ్వడంతో మోహన్ బాబు యూనివర్సిటీలోని సమాధుల వద్దకు చేరుకున్నారు. అక్కడ మోహన్ బాబు ఏర్పాటు చేసిన ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది కేవలం మనోజ్, అతని భార్యను మాత్రమే లోపలకు అనుమతించి మిగతా వారికి నిరాకరించారు. ఈ దశలో మీడియాను సైతం లోపల అనుమతించలేదు. ఈ సందర్భంగా మోహన్‌బాబు బౌన్సర్లే ఒకరినొకరు దాడిచేసుకుంటూ బయటి వారు వచ్చి దాడి చేశారని రాద్ధాంతం చేసినట్లు తెలుస్తోంది. సిఐ గోవిందప్ప నచ్చజెప్పేందుకు ప్రయత్నించడంతో వినకపోవడంతో స్వల్ప లాఠీఛార్జీ చేశారు. అనంతరం భార్య మౌనికతో కలిసి మనోజ్ అవ్వాతాతలకు నివాళి అర్పించారు. తాను అవ్వాతాతకు నివాళి అర్పించేందుకే వచ్చానని, కళాశాలలో జరుగుతున్న తప్పులు ఎత్తి చూపడమే తాను చేసిన తప్పని అన్నారు.

నేలపట్టులో పర్యాటకులకు ఏర్పాట్లు : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి -దొరవారిసత్రం

సూళ్లూరుపేట నియోజకవర్గం నేలపట్టులో ఈనెల 18- 20 తేదీల్లో మూడు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రాన్ని వీక్షించేందుకు రానున్న పర్యాటకుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని గూడూరు సబ్ కలెక్టర్, ఫెస్టివల్ నేలపట్టు కేంద్రం కన్వీనర్ రాఘవేంద్ర మీనా ఆదేశించారు. బుధవారం ఆయన అధికారులతో నేలపట్టు పక్షుల కేంద్రంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులు వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా రోడ్డు మార్గాలలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల రద్దీని దష్టిలో పెట్టుకుని చెరువు కట్టపై వన్ వే మార్గం లో పర్యాటకులు రాకపోకలు జరిగేందుకు బార్‌కేడ్లు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్, ప్రమాదాలు జరగకుండా పోలీస్ పోస్టులు నియమించాలని సూచించారు. ప్రధానంగా మహిళలు కొరకు అవసరమైన టాయిలెట్ సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. సురక్షిత మంచినీటి



సదుపాయం విధిగా ఉండాలని చెప్పారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో అవసరమైన అన్ని మందులను సంసిద్ధపరచుకొని మూడు రోజులపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గెస్ట్ హౌస్ నిర్మాణాలు, విశ్రాంతి కొరకు సంసిద్ధం చేయాలని పి ఆర్ అధికారులకు సూచించారు. ప్రతి శాఖ అధికారులు ఎవరికి సంబంధించిన ఏర్పాట్లు వారు సకాలంలో పూర్తి చేయాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శైల కుమారి, సిఎఫ్ఓ సెల్వరాజ్, డి.ఎస్.పి చెంచు బాబు, ఎస్ఐ అజయ్ కుమార్, ఎంపీడీవో గోవర్ధన్, ఎంఈఓ కష్ణయ్య, డివి సత్రం మెడికల్ ఆఫీసర్ చంద్రకళ, నేలపట్టు వైల్డ్ లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కోహ్లీ నాకు స్ఫూర్తి

యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



సీనియర్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తనకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన ఆయన దర్శనం అనంతరం తిరుపతిలోని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో చైల్డ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని, మీడియాతో మాట్లాడారు. ఎప్పటికైనా భారతదేశం తరుపున ఆడాలనేది తన చిన్ననాటి కళ అని, దాన్ని సాకారం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆస్ట్రేలియా పర్యటనకు ప్రత్యేకించి ప్రణాళికలు ఏమి చేయలేదని, తన ఆటను తాను ఆడానని తెలిపారు. సీనియర్లు అందరూ విఫలమైన ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ చేయటానికి తాను ఎప్పటికీ మర్చిపోనని, ఆరోజు జట్టును ఆదుకోవడం మధుర క్షణాలని ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రికెట్ ఆడగలరని, తమలోని నైపుణ్యానికి పదునుపెట్టి, తమ శక్తి మేరకు పూర్తిస్థాయి ప్రదర్శన చూపగలిగితే వారి ప్రతిభ కచ్చితంగా వెలుగులోకి వస్తుందని యువ క్రీడాకారులకు సూచించారు. రాబోవు టి20 టోర్నీలో బాగా ఆడేందుకు కసరత్తు చేస్తున్నానన్నారు. భారత జట్టుకు నాయకత్వ విషయం బోర్డు పెద్దలు చూసుకుంటారని, తన ధ్యాస అంతా త్వరలో జరగబోవు టి20 టోర్నమెంట్ పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు క్రికెట్ విజయ్, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, కార్పొరేటర్లు నరసింహ చారి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో రాజనేని రామనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాతి సంబరాల్లో భాగంగా వృద్ధాశ్రమ వృద్ధులకు ట్రస్ట్ వ్యస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో సంక్రాతి కానుకగా దుస్తులు, భోజనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను వృద్ధాశ్రమంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపాక సహాయక వ్యవ స్థాపకులు శిరీషమ్మ, రామయ్యానాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్ మస్తాన్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -కేవీబి పురం: కెవిబిపురం మండలం రాయపేడు గ్రామం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలలో విజేతలైన చిన్నారులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన రాయపేడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్, రన్నింగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలైన ఈశ్వరి, సంజన, రూప, ముని లక్ష్మీ ,యామిని, యోగి , పార్థులకు బహుమతులను మండలంలోని సీనియర్ జర్నలిస్ట్, కేవీబి పురం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముని భాస్కర్, ప్రజాశక్తి విలేకరి ఢిల్లీ బాబు, పాఠశాల మాజీ ఛైర్మన్ మురళి, ఉపాధ్యాయుడు రఘు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయపేడు గ్రామంలోని డిగ్రీ విద్యార్థులు దాసరి అనిత యాదవ్, లహరి యాదవ్ , సౌమ్య యాదవ్, రమేష్ యాదవ్, సంజనా యాదవ్, బాలయ్య, నాగూరు, చిరంజీవి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సీఎంకు సత్కారం



సీఎంకు వీడ్కోలు పలుకుతున్న మాజీ మంత్రి చెంగారెడ్డి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి తో కలిసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి స్వగ్రామమైన నారావారి పల్లెలో సంక్రాంతి పండుగను ముగించుకొని తిరుగు ప్రయాణంలో భాగంగా సీఎం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే విమానాశ్రయంలో వేచి ఉన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి , పద్దు రాజు జయచంద్ర నాయుడు ముఖ్యమంత్రికి శాలువా కప్పి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీకి ఘన నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ విరివింటి మురళీధరశర్మకు విశ్వవిద్యాలయంలోని అకాడమిక్ భవనంలో ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విసి మాట్లాడుతూ మురళీధర శర్మ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విద్యాపీఠం హోదా పొందడంలో ఆయన అహర్నిశలు కృషి చేశారని, ఆయన సేవలను కొనియాడారు. వారి శిష్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలను వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రుయాస్పత్రిలో రోగులకు, పేదలు, అనాథలు 300 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో విభిన్న విభాగాల అధ్యాపకులు, ఆప్తులు, మిత్రులు, శిష్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి -కోట : కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో కొడవలూరు.దీపక్ రామి రెడ్డి గిరిజన కాలనీ, మరొక కాలనీలో సంక్రాంతి పండుగలు సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసిపి సీఈసీ సభ్యులు కొడవలూరు ధనంజయ రెడ్డి ల చేతులు మీదుగా 300 మంది గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరీగ మురళి మాట్లాడుతూ కొడవలూరు ధనుంజయ రెడ్డి ప్రతి సంక్రాంతికి నిరుపేదలైన గిరిజనులు మధ్యలో వేడుకలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కొడవలూరు ధనుంజయ రెడ్డి, ఆయన కుమారుడు దీపక్ రామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర సిఈసి సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి ఊనుగుంట పాలెం గ్రామానికి సాగరంతో ఒకప్పుడు ఆ కాలనీవాసులు, పలువురు రాజకీయ నాయకులు,అభిమానులు పూలమాలలు, శాలువాలు కప్పి మేళా తాళాలతో ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి, ఎంపీపీ దాసరి అంజమ్మ, గోనుపల్లి శ్రీను, ఫుట్టు నారాయణ, తన్నమాల కోట రెడ్డి, నాగూర్ యాదవ్, సుబ్రహ్మణ్యం, శివరామ్ నాయుడు, హనుమంత్ రెడ్డి, గోనుపల్లి మస్తాన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మసీ డిప్లొమా కోర్సుకు స్పాట్ అడ్మిషన్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి ఉమెన్స్ పాలిటెక్నిక్ ఫార్మసీ విభాగం ఫార్మసీలో కొన్ని డిప్లొమా సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎంపిసి, బైపిసి ఉత్తీర్ణతతో ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు ప్రవేశానికి అర్హులని అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌తో సహా ఉచిత హాస్టల్ వసతి, ఉచిత ఆహారం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 21వ తేదీ లోపు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తును సమర్పించాలని కోరారు. 10వ, ఇంటర్మీడియట్ మార్క్ షీట్లు, బదిలీ సర్టిఫికెట్, 6 నుండి ఇంటర్మీడియట్ వరకు సర్టిఫికెట్లు, నేటివిటీ సర్టిఫికెట్, కులం, ఆర్థిక ధృవీకరణ పత్రం, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ డబ్ల్యు ఎస్ సర్టిఫికెట్, 6 పాస్‌పోర్ట్ కలర్ ఫోటోలు, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, ఎస్‌బిఐ బెటర్ అవసరమైన ఏవైనా ఇతర పత్రాలు, మరిన్ని వివరాల కోసం డాక్టర్ ఎం పద్మావతమ్మ 929900815, డాక్టర్ కె ప్రశాంతి 9247575386, డాక్టర్ కె వి గోపీనాథ్ 8978993810 ఫోను నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేడుకగా గిరిప్రదక్షిణ



గిరి ప్రదర్శనలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల గిరిప్రదక్షిణ బుధవారం వేడుకగా నిర్వహించారు. ప్రతి యేటా కనుమ పండుగ రోజు స్వామి అమ్మవార్లు గిరి ప్రదర్శన వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ముందు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం కైలాసగిరిల ప్రదక్షిణకు తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొండచుట్టులో పాల్గొన్నారు. శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కనుమ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కనుమ పండుగను పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలోని. సదాశివ ఆలయ ప్రాంగణంలో, గేట్ పుత్తూరు, మున్సిపాలిటీ పరిధిలో వెర్రిపల్లి, చిన్నరాజుకుప్పం, తిమ్మాపురం, పరిసర ప్రాంతాల్లో రైతులు ఆవులు, ఎద్దులను శుభ్రం చేసి వాటి కొమ్ములకు రంగులు వేసి, బెలూన్లు కట్టి, వివిధ రకాల దారాలతో అలంకరించి పూజలు చేసి ఎద్దులనుంచితో పిల్లలు పెద్దలు కలిసి అందరూ ఊరేగుతూ ఆనందంగా కనుమ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ సునీల్ కుమార్, వారి కుటుంబ సభ్యులు, బాబు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి రాక

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గురువారం ఉదయం 11 గంటల వెంకటగిరికి రానున్నారని వైసిపి నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి లోని నేదురు మల్లి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రాజేంద్ర ఆచారికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కార్వేటినగరం రోడ్డులోని వీర బ్రహ్మంగారి ఆలయ వ్యవస్థాపకులు రాజేంద్ర ఆచారి హఠాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పుత్తూరు పట్టణంలోని రాజేంద్ర గృహం వద్దకు వెళ్లి ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. బ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి ఎంతో కృషి చేసిన మంచి వ్యక్తి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ గోపి ఆచారి, మురళి ఆచారి, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, టిడిపి నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అటకెక్కిన అరణియార్ అభివృద్ధి

- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..
- నిధులు రూ.35.64 కోట్లు మంజూరు
- కాంట్రాక్టరు నిర్వాకం
- అర్ధాంతరంగా ఆగిన పనులు



కట్టపై అసంపూర్తిగా మిగిలిన పిట్టగోడల నిర్మాణం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధికి మంజూరైన కేటాయించిన జైక నిధులు 35.64 కోట్లు నిరుపయోగంగా మారాయి. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో అరణియార్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

తిరుపతి జిల్లాలోని పిచ్చాటూరు మండలం చిన్న తరహా ప్రాజెక్టుల్లో ఒకటి.. ప్రాజెక్టులకు తలమానికంగా నిలుస్తున్న అరణియార్ నీటి నిలువ 1.82 టిఎంసిల సామర్థ్యం వుంది. 1958లో నిర్మించిన ఈ ప్రాజెక్టు రైతులకు నేటి వరకూ మూడు పంటలు అందిస్తూ ఆదుకుంటోంది. ప్రత్యక్షంగా ఐదువేల ఎకరాలకు నీరు అందిస్తూ, పరోక్షంగా ఐదు వేల ఎకరాలకు అరణియార్ నీరు అందిస్తోంది. పిచ్చాటూరు, నాగలాపురం మండలానికి చెందిన రైతులకు గొప్ప వరంగా నిలిచింది. అలాంటి ప్రాజెక్టు డిసెంబరులో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి పూర్తిగా నీరు చేరి నిండుకుండలా కనువిందు చేస్తోంది. ఈ ప్రాజెక్టు 450 మంది మత్స్య కార్మికుల కుటుంబాలకు జీవనం కల్పిస్తోంది.

అభివృద్ధికి నిధులు మంజూరు

ఇలాంటి అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులకు జైక నిధులు 2017-2018 సంవత్సరంలో రూ.35.64 కోట్లు మంజూరు అయ్యాయి. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా నేటికీ 20 శాతం పనులు అసంపూర్తిగా వున్నాయి.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

కాంట్రాక్టర్ పుణ్యమా అని ప్రాజెక్ట్ పై పిట్ట గోడలు ఇరువైపులా పూర్తి చేయాల్సింది వుంది. 20 శాతం పనులు కూడా చేయకుండా అసంపూర్ణంగా నిలిచిపోయింది. ఇరిగేషన్ కార్యాలయం కొత్తగా ప్రారంభించి స్లాబ్ వేశారు. కానీ గోడలు నిర్మించి పూర్తి చేయకుండా అవి అసంపూర్తిగానే మిగిలాయి. డిసెంబరులో కురిసిన వర్షానికి ప్రాజెక్టుపై రోడ్డు మరమ్మతులు చేయకపోవడం వల్ల బురద మారి రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. ప్రాజెక్టు లోపల భాగంలో పెద్ద ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి.. చెట్లను తొలగించని కారణంగా ప్రాజెక్టు లోపల ముళ్ల చెట్లు ప్రమాదకరంగా మారాయి. ప్రపంచ బ్యాంకు 2017-18 సంవత్సరంలో జైక నిధులు 35.64 కోట్లు మంజూరు చేయగా ఇంతవరకు 6.5 కోట్ల మేర పనులు మాత్రమే చేసి 6.14 కోట్లు నిధులు కూడా పొందారు. అయినా కాంట్రాక్టరు ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. అధికారులు మాత్రం వారిపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధికి తోడ్పాటు అందించలేక పోతున్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధిలో జైక నిధులు ఒక గొప్ప వరమని రైతులు భావిస్తున్నారు. అలాంటి వరం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఇష్టానుసారంగా వ్యవహరించుటం వల్ల ప్రాజెక్టు అభివృద్ధికి కుంటుపడిందని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ రద్దుపరిచి మరొకరికి అవకాశం కల్పించి అభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి. జైక నిధులు మంజూరై ఆరు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఇంతవరకు 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. కాంట్రాక్టరుపై కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు స్పందించి జైక నిధులు టెండర్ తీసుకున్న వ్యక్తితో త్వరగా పనులు చేయించాలి.. లేకుంటే అతని టెండరును రద్దు చేసి మరొకరికి అప్పగించి త్వరగా జైక నిధులను ప్రాజెక్టుకు వినియోగించి అభివృద్ధికి దోహదపడాలి..

- డి రవి, ఆయకట్టు ఛైర్మన్, పిచ్చాటూరు మండలం.

20 శాతం పురోగతి..

పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు పనులు 20 శాతం జరిగాయి. జైక నిధుల పనులు శ్రీకాళహస్తి డివిజన్ కార్యాలయం అధికారులు చేయాల్సి వుంది. వారిని సంప్రదించి త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం..

- రామచంద్రమూర్తి, ఇరిగేషన్ డిఈ, పిచ్చాటూరు మండలం.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

ప్రజాశక్తి- వెంకటగిరి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం పదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఆఫ్కాస్ సిబ్బందికి సంక్రాంతి పండగ పూట కూడా జీతాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా పండగ చేసుకోవాలని ప్రశ్నించారు. ఛైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కష్టపడి పనిచేసే పారిశుధ్య కార్మికుల్ని అంత చులకనగా చూడటం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికుల సమస్యలు పరిస్కరించరని, జీతాలు ఇవ్వరని, ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికోసం మున్సిపల్ అధికారులు ఉన్నారని నిలదీశారు. పది సంవత్సరముల నుండి నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌స్పెక్టర్ రామారావు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని మున్సిపాల్టీల్లో జీవో నెంబర్ 36 ప్రకారం చెత్త వాహనాల డ్రైవర్లకు రూ.24,500 ఇస్తున్నారని, వెంకటగిరి మున్సిపాల్టీల్లో ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు. దీనికి బాధ్యులెవరు? ఈ జీవో ను అమలు చేయాల్సింది ఎవరని నిలదీశారు. దీన్ని పరిశీలిస్తే మున్సిపల్ అధికారులు, పాలకులు, కార్మికుల పట్ల ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే స్పందించి కార్మికులకు జీతాలు ఇప్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం రమణ, టి సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, వి పెంచలయ్య, మాధురి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా ఉదయ్ వంశీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడుగా ఉదయ్ వంశీని నియమించారు. ఈ సందర్భంగా ఉదయ్ వంశీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం భాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో అందర్నీ కలుపుకుంటూ వైసిపి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతిష్టాత్మకంగా పార్టీ సేవలను ప్రజల్లోకి తీసుకెళతానని పేర్కొన్నారు.తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డికి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీ అనుబంధ విభాగాలకు కార్యవర్గ నియామకం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైసిపి అనుబంధ విభాగాలకు జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఇందులో ప్రధానమైన జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులుగా తిరుపతి రూరల్ మండలం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని , బీసీ విభాగం అధ్యక్షులుగా చిన్ని యాదవ్, రైతు విభాగం అధ్యక్షులుగా మల్లం చంద్రమౌళి రెడ్డిలను ఎంపిక చేశారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల పర్యవేక్షకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాయకత్వంలో వీరంతా పని చేశారు. వైసిపి ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలోకి వచ్చినా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన వారికి పదవులు రావడం పట్ల ఆ పార్టీ సీనియర్లలో హర్షం వ్యక్తమవుతోంది. చంద్రగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిఫార్సు మేరకు ఆ ముగ్గురుకి జిల్లా పార్టీలో కీలక పదవులు లభించడంపై అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి.


పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు

వైసిపి అనుబంధ విభాగాల్లో కీలకమైనవి చంద్రగిరి నియోజక వర్గానికి అవకాశం కల్పించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్ ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకు పదవులు పొందిన ఆ ముగ్గురు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు పాటు పడుతూ, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. అంతకు ముందు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలను బుధవారం వారు కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆర్థిక సాయాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి దాత బుధవారం అందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన నింద్ర సుధాకర్ రూ. 1.50 లక్షలు విరాళంగా అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందించి విజయవాడ వరద బాధితుల సహాయార్థం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగనేని చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్ అందిస్తున్న దాత నింద్ర సుధాకర్

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ వేణుగోపాల పురం గ్రామంలో 2025 నూతన సంవత్సరం, సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకుని తడుకు పంచాయతీ సర్పంచ్ బొబ్బిలి తన గ్రామంలో యువత కోరిక మేరకు క్రికెట్ టోర్నమెంట్ ను బుధవారం నిర్వహించారు. ఇందులో గెలిచిన వారికి (విన్నర్) శీను టీం మొదటి బహుమతిగా రూ, 3 వేలు, రెండవ బహుమతిగా నరసింహులు టీం (రన్నర్) రూ.2 వేలు అందించారు. యువతను ప్రోత్సహిస్తున్న సర్పంచ్ బొబ్బిలికి యువత, గ్రామస్తులు అభినందనలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.



యువకులకు క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్న తడుకు సర్పంచ్ బొబ్బిలి

'సుభాష్ పాలేకర్స్ ప్రకృతి వ్యవసాయం' సదస్సుకు రండి..

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రకృతి వ్యవసాయ జాతీయ ఉద్యమ నాయకుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ముఖ్య అతిథిగా పాల్గొనే ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు, రైతులకు అవగాహన కల్పించేందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25, 28 తేదీల్లో నిర్వహించనున్న సదస్సుకు రావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కార్యక్రమ నిర్వాహకుడు, ఎస్వియు ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణ బుధవారం ఆహ్వానించారు.ఈ సందర్భంగా పాకనాటి హరికృష్ణ మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రావాలని వారు ఆహ్వానించారు. భారతదేశంలో ప్రకృతి వ్యవసాయం మూలకర్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ద్వారా జనవరి 25 న వెయ్యి మంది విద్యార్థులకు, 28న వెయ్యిమంది రైతులకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'ప్రకృతి వ్యవసాయం'పై అవగాహన, సాధికారితనూ కల్పించేందుకు కార్యశాల, సదస్సును నిర్వహించాలని ఎస్వియు ఇన్‌ఛార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు నిర్ణయించారని కార్యక్రమ నిర్వాహకుడు హరికృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల సదస్సుకు విశ్వ విద్యాలయం ద్వారా కాలేజీ యాజమాన్యాలకూ ఆహ్వానం పంపుతామన్నారు. రైతు సదస్సుకు తిరుపతి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం కన్వీనర్ కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మాజీ ఛైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సదస్సుకు రావాలని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ఆలయాలకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -రామచంద్రపురం: రామచంద్రపురం మండలంలోని అనుపల్లి, కమ్మ కండ్రిగ గ్రామలలోని గ్రామ దేవతలైన శ్రీ సత్తెమ్మ తల్లి విరపాక్షమ్మ ఆలయాలకు సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సతీమణి పులివర్తి సుధారెడ్డిలు బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు కమ్మకండ్రిగ, అనుపల్లి గ్రామాలలో మంగళ వాయిద్యాలు, బాణా సంచా కాలుస్తూ గజ పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.. గ్రామస్తులు ఎమ్మెల్యే దంపతులకు అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఈ సందుగ సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలని ఆక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీలు డి బిందు మాధవి, టి కేశవులు నాయుడు, చేకూరి జనార్దన్ చౌదరి, చేకూరి వెంకట ప్రసాద్, టిడిపి నాయకులు ఎన్ మునిరత్నం నాయుడు, ఆకా దేవరాజులు బొడ్డు ముని రాజా, లో శెట్టి రూపు రాయల్, నేస్తనూరి రాము, బండి విజయ్ కుమార్ రెడ్డి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బీగాల అరుణ, చిట్టిబాబు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే నాని

క్రైం న్యూస్

స్కూటర్‌ను ఢీకొన్న కారు
వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్కూటరును కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వడమాలపేట మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..ఎస్‌వి పురం గ్రామపంచాయతీ జానాల కొట్టాల కి చెందిన చంద్రశేఖర్ రాజు తిరుపతిలో ప్రైవేట్ హోటల్లో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. డ్యూటీ అనంతరం తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరుపతి నుండి బయలుదేరాడు. వడమాలపేట కదిరి మంగళం బైపాస్ రోడ్డు వద్ద వెళుతుండగా పిచ్చాటూరు నుంచి తిరుపతికి వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనదారుడు చంద్రశేఖర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం
వృద్ధులకు గాయాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించి ఓ ఇంటిపై దాడి చేసి వృద్ధులను గాయపరిచిన సంఘటన మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ జయశంకర్ కాలనీలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..గంగాధరి అనే వ్యక్తి తల్లిదండ్రులు సిద్ధప్ప, మల్లక్కతో కలిసి జయశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరి నివాసానికి సమీపంలో అనధికారికంగా కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకున్న యువకులు కిరణ్, సాయి, ఆదర్శ్ ఉన్నారని, ఈ ముగ్గురు తన కుమారుడు జి.కిరణ్ స్నేహితులే అని తెలిపారు. ఏం జరిగిందో తెలియదు గానీ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం సేవించి కిరణ్, సాయి, ఆదర్శ్ లు ఒకసారిగా ఇంటిలోకి చొరబడి కాశి రాళ్లు, వెదురుకర్రతో దాడికి పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాలైన గంగాధరి, సిద్ధప్ప, మల్లక్కలు తిరుపతి రుయాస్పత్రికి వెళ్లడంతో అక్కడ వైద్యులు గంగాధరికి తల, ముఖంపై చీలికలు ఏర్పడడంతో కుట్లువేసి చికిత్స చేశారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా తిరుచానూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖిలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్వర్ణముఖి నది రామసేతు వంతెన వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వన్ టౌన్ పోలీసులు స్థానిక రామసేతు వంతెన వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు 53 ఏళ్ల వుంటుందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. మృతుడు రామసేతు వంతెన పై నుంచి గాలంతో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నదిలోకి జారి పడి మృతి చెందిన ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



టిఎన్ఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - క్యాంపస్ : భోగి పండుగ సందర్భంగా నారావారిపల్లెలో టిఎన్ఎస్ఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆంధ్రప్రదేశ్ శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో తిరుపతి టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, టిఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజ్ సెక్రటరీ ఆర్ కె నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదినం

ప్రజాశక్తి -కోట : ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోట కేంద్రం ఆధ్వర్యంలో బెహన్ కుమారి మాయావతి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మీజూరు మాధవ్ మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన ఏకైక మహిళ మాల మాదిగలులు కలిసి ఉండి అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారం వైపు వెళ్లాలని పిలునిచ్చిన మహిళా నేత మాయావతి అన్నారు. ఈ కార్యక్రమంలో పి మల్లికార్జున్ రావ్, లీగల్ అడ్వైజర్ అశోక్ కాంబ్లె, పి హేమంత్, పిండి కేశవ, దార్ల ఏడుకొండలు, మీజూరు మురళి, కుదురు కోటేశ్వరరావు, కనుపూరు కృష్ణయ్య, పామంజి నాగేంద్ర, ఎమ్ అనీల్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ :గూడూరు పట్టణంలోని పోస్ట్ ఆఫీసు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాయావతి జన్మదిన వేడుకలను నాయకులు బహుజన సమాజ్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్నిమాయావతి అనుసరించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆమె ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సుధాకర్ , రాజు , మురళీ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరిస్తాం: షేక్ జలీల్ అహ్మద్

ప్రజాశక్తి -కోట : చాలా ఏళ్లుగా అపరి ష్కృతంగా వున్న సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తిరుపతి పార్లమెంట్ మైనారిటీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ పేర్కొన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచనలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రారంభించిన 'శుభోదయం-కోట పట్టణం' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కోట పంచాయతీ పరిధిలోని లక్ష్మమ్మ గిరిజన కాలనీ, అరుంధతీవాడ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కోట పంచాయతీ పరిధిలోని లక్ష్మమ్మ గిరిజన కాలనీ వాసుల సమస్యలు షేక్ జలీల్ అహ్మద్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా కాలనీ వాసులు ప్రధాన సమస్య శ్మశానవాటిక వెళ్లే రహదారి కట్ట ర్యాంప్ నిర్మించాలని తెలపడంతో స్పందించిన జలీల్ అహ్మద్ నీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా త్వరలోనే సమస్యలు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పరిష్కరిస్తారని తెలిపారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలోని కొయ్యలమిల్లు వీధిలో (అరుంధతీయవాడ)లో గతంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఆ వీధిలో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి లెవెలింగ్ పనులు చేపట్టామని తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించనున్నామని తెలిపారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న షేక్ జలీల్ అహ్మద్

ఘనంగా అన్నా రామచంద్రయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా నాయకుడు, అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్రయ్య యాదవ్ జన్మదిన వేడుకలు అఖిల భారతీయ రాష్ట్ర మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు శంకర్ యాదవ్, యువ నాయకుడు తక్కాలి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రామచంద్రయ్య యాదవ్ కేకును కట్ చేసి ఆయన అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం రూయ హాస్పిటల్ వద్ద, గోదాదేవి మార్గంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, మాజీ టిటిడి డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, రఫీ హిందుస్తానీ, ఈతమాకుల హేమంత్ కుమార్ యాదవ్, భరణి యాదవ్, కట్ట జయరామ్ యాదవ్, సుబ్బు యాదవ్, ఉమాపతి యాదవ్, మధు యాదవ్, మురళి నాయుడు, రమణ రెడ్డి, హరిబాబు రెడ్డి, రాజా, సోము, సాయి, యువరాజ్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న అన్నా రామచంద్రయ్య యాదవ్